# 'ఏ విలువలివి?'

అదేం జాడ్యమో ఏమోగానీ మన దేశంలో చేసే వృత్తినిబట్టి వ్యక్తికి గౌరవం తగలబడుతుంది.

అదే పాశ్చాత్య దేశాల్లో బేకరూ, షూ మేకరూ, స్మిత్, ఫిషర్ లాంటివి ఇంటి పేర్లుగా ఉంటాయి. పైగా వాటి ముందు మిస్టర్ చేర్చి మరీ మర్యాదగా పలకరిస్తారు వాళ్లు.

మనం వాళ్ల దగ్గర్నించీ ఏది నేర్చుకోకూడదో అది నేర్చుకుని, ఏది నేర్చుకోవాలో దాన్ని వదిలేసిన వాళ్లం.

సరే ఆ మధ్యనో మధ్యాహ్నం నేనూ మరో వ్యక్తీ పనిమీద సిల్వర్ జూబ్లి కాలేజీకి వెళ్లి వస్తున్నాం. దార్లో బాలు కలిసాడు. నన్ను చూసి సైకిలు దిగి ఆప్యాయంగా రెండు పలకరింపు మాటలు మాట్లాడి మళ్లీ సైకిలెక్కి అరుస్తూ వెళ్లిపోయాడు.

అరవడమేమిటీ అనుకుంటున్నారా?

అతనరిచే అరుపు అమ్మకపు టరుపు... అది కూడా.

"లంగాలూ... దోమతెరలూ... జాకెట్ పీసులూ" అనే అరుపు.

నా పక్కనున్న వ్యక్తి "ఏమన్నా! నీకు లంగాలమ్మేవాడితో ఏం పనీ పైగా బ్రహ్మచారివి" అని కాస్తా వెకిలిగా నవ్వుతూ అడిగాడు.

కలక్కుమంది లోపల...

అట్లా ప్రశ్నించిన వ్యక్తికి నేను సభ్యతా, సంస్కారమూ, మర్యాదలు గురించి పాఠాలు తీసుకోనవసరంలేదు. అతను శుభ్రంగా చదువుకుని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్నతమైన పదవిలోనే ఉన్నాడు.

సరే బాలు అసలు పేరు బాలాజీరావు... నాకు గుర్తున్నప్పట్నించీ వాళ్ల కుటుంబమంతా అదే వృత్తిలో ఉన్నారు.

నా చిన్నతనంలో వాళ్ల నాన్న నాగోజీరావు దోమతెరలూ, లంగాలకూ చోళీలకూ గుడ్డముక్కలు అమ్మేవాడు. ఆయన్తర్వాత బాలాజీరావూ అతని అన్న వెంకోజీరావూ కూడా అదే వృత్తిలోకి వచ్చారు.

మొన్న బాలాజీరావు ఇంటికి వచ్చాడు.

అక్కయ్యలు వాడుకగా అతన్దగ్గరే లంగాలు కొంటారు.

అప్పుడతన్తో కాస్సేపు అతని వ్యాపారం గురించి మాట్లాడాను. కొడుకును కూడా పదవ తరగతి తర్వాత యిదే వృత్తిలోకి దింపానని చెప్పాడు... "ఇప్పుడు ఓ అయిదు మెషీన్లు పెట్టుకుని రోజుకు ఏభై అరవై లంగాల దాకా కుడుతున్నాము. అవికాక దోమ తెరలూ నైటీలు కూడా కుడుతున్నామనీ చాలామటుకు దుకాణాలకు వేసి కొన్ని మాత్రం సైకిలు మీద తిరుగుతూ అమ్ముతున్నామని" చెప్పాడు. ఒక్కో లంగా ఖరీదు ఏభై అని కూడా చెప్పాడు.

కాకి లెక్కలు వేసుకున్నా నెలకు లక్షన్నర్రూపాయల టర్నోవరు బాలాజీరావుది. లంగాలమ్మేవాడిని గేలిచేసిననా ప్రభుత్వోద్యోగి మిత్రుడికి ఆమాట చెబితే ఎట్లా రియాక్ట్ అవుతాడోననిపించింది.

నెలకు లక్షన్నర్రూపాయల వ్యాపారం చేసేవాడని మర్యాదిస్తాడేమో.

అందుకే వేమన అన్నాడు.

"కలిగిన మనుజుడు కాముడైసోముడై
మిగుల తేజమున మెరయచుండు
విత్తహీనుడైన వుత్త సన్యాసిరా" అని.

సరే డబ్బుతోకాకుండా బాలాజీరావులాంటి వాళ్లకు వ్యక్తులుగా ఎందుకు గౌరవం లభించదు అన్నది సమాధానం తెలిసిన ప్రశ్నగానే మిగిలిపోయింది.

మానవత్వం, స్నేహానురాగాలూ, మమతలూ మర జీవితాల్లో పడి నలిగి పోతున్నాయి... పోతున్నా యేమిటి పోయాయి.

ఒక్క స్నేహార్ద్రతతో తడిసినమాట.

ఓ నిష్కల్మషమైన పలకరింపు వ్యక్తిని వ్యక్తిగా చూసే కనీసపు మానవీయ విలువలు క్రమేణా మృగ్యమైపోతున్నాయి.

'నువ్వేమిటి?' పోయి, నువ్వెంత?' వచ్చేసింది.

లంగాలమ్మే బాలాజీరావూ, కోఠీలో రవికెలమ్మే వ్యక్తిలాంటివాళ్లు అసంఖ్యాకం, మన సమాజంలో మహామహులు కొందరే, కానీ బాలాజీరావులాంటి వాళ్ల ద్వారానే ఈ సమాజం నిండి ఉంది. వారికి అర్హమైన గౌరవం, కనీస మర్యాదను మనం యివ్వాలిగదా... యిస్తున్నామా?

ఈ సమస్య గురించే హెలెన్ కెల్లర్ చేసిన వ్యాఖ్య గుర్తు చేసుకుందాం.

"ఈ ప్రపంచం గొప్ప హీరోలు కదిలిస్తూంటేనే ముందుకు వెళ్లడంలేదు... అసంఖ్యాకంగా ఉన్న నిజాయితీపరులైన పనివాళ్ల చిన్నచిన్న తోపుల ద్వారా కూడా అని మనం గ్రహించాలి" అన్నది ఆ వ్యాఖ్య.

ఎంతాలోచించినా ఏం చేసినా మన మన వైయక్తిక విలువలకీ సిద్ధాంతాలకీ మనమే కదా పాలిష్ పెట్టుకోవాల్సింది. పాలిష్ పెట్టుకునే అవసరం మాత్రం వచ్చింది. ●